


త్వరలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం

ప్రజాశక్తి - సీతానగరం

త్వరలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తామని జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్, మండల ఇంజనీరింగ్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అలాగే గ్రామ సచివాలయాల్లో ఎన్ని ఖాళీలున్నాయి వివరాలను సేకరించి తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం నిర్ణయం ఉంటుందన్నారు. ఎన్నికలకు మార్చి వరకు సమయం ఉందని, ప్రభుత్వం నిర్ణయం చేస్తే దాని ప్రకారం సిద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.

ఇనాం భూములకు దక్కని 'సుఖీభవ'

- 600 మందికి రైతులకు మొండిచేయి
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన జనసేన ఎమ్మెల్యే




కలెక్టర్‌కు వినతిని అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే (ఫైల్)

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఇనాం భూములు సాగు చేస్తున్న రైతులకు అన్నదాత సుఖీభవ కింద నగదు బదిలీ జరగలేదని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు వెయ్యి ఎకరాల భూముల వరకు రైతులకు ఈ పథకం వర్తించలేదు. గత ప్రభుత్వం హయాంలో ఇనాం భూములు సాగు చేసిన రైతులకు రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందింది. కానీ టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలోనే ఈ రైతులకు ఎలాంటి ఆర్థిక సాయం అందలేదని సాక్ష్యాత్తూ కూటమి ప్రభుత్వంలోని జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీరఘట్టం మండలం వండవ గ్రామంలోనే 600 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద నగదు బదిలీ జరగలేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. వెబ్ ల్యాండ్‌లో ఈ భూముల సర్వేనెంబర్లు లేకపోవడంతో అన్నదాత సుఖీభవ కింద నగదు బదిలీ జరగలేదని అధికారులు చెబుతున్నారు. అయితే గత ప్రభుత్వం హయాంలో ఇదే రైతులకు ఆర్థిక సాయం అందడంతో ఆ రైతులు అధికారపార్టీ ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచుతున్నారు. రెండు నెలల క్రితం టిడిపి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.7 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేసింది. మూడు విడతల్లో కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న రూ.6వేలతో కలిపి రూ.20వేలు నగదు బదిలీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఇనాం భూములు సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పాలకొండ నియోజకవర్గం లోని ఒక్క వండవ గ్రామంలోనే 600 మంది రైతులకు అందకపోవడంతో అక్కడి ఎమ్మెల్యే జయకృష్ణ ఆలస్యంగా స్పందించారు. మళ్ళీ ఆ దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోవడంతో ఆయనే స్వయంగా రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలుస్తోంది. ఒకవేళ అధికారులతో సమస్య కొలిక్కిరాకపోతే తానే సిఎం చంద్రబాబు నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పుకొచ్చారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం : మంత్రి



గిరిజన సంక్షేమ బాలిక పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు


ప్రజల సమస్యలను తెలుసుకొని వాటికి సానుకూలంగా స్పందించి పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అలాగే గిరిజన విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, మౌలిక వసతుల కల్పనతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. మండలంలోని కొత్తవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డితో కలిసి మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఆరు పాఠశాలలకు రూ.20 కోట్లు వెచ్చించగా, ఒక్క సాలూరు నియోజకవర్గంలోనే మూడు పాఠశాలలను రూ.13 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. 650 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో అదనపు భవనాలు విద్యార్థులు కోరినట్లు చెప్పారు. ఈ మేరకు రూ.5.72 కోట్లతో అదనపు భవనాలు, భోజనానికి, ఆడుకోవడానికి అన్ని రకాల వసతులను కల్పిస్తున్నట్లు మంత్రి చెప్పారు. పాచిపెంట మండలం సరాయివలసలో రూ.4.75 కోట్లతోనూ, మామిడిపల్లిలో తొలివిడతగా రూ.2 కోట్లతో పాఠశాలల అదనపు భవన నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. మిగిలిన పాఠశాలలకు మౌలిక వసతులను కల్పించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.112 కోట్లను మంజూరుచేసినట్లు చెప్పారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా గిరిజన వసతి గృహాల్లో అదనంగా 2,030 మరుగుదొడ్లను స్వచ్ఛంద్రా కార్పొరేషన్ ద్వారా నిర్మించనున్నట్టు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ఎఎన్‌ఎంలను వేశామని, వారంతా వారానికి రెండు రోజుల పాటు ఉండి పర్యవేక్షిస్తారని, అవసరమైతే వైద్యులతో వైద్యం చేయిస్తారని అన్నారు. జిల్లాలో అనారోగ్యానికి గురైన 160 మంది పిల్లలంతా ఆరోగ్యంగా ఉన్నారని, కెజిహెచ్‌కు పంపిన 65 మంది విద్యార్థులకు గాను 64 మంది ఆరోగ్యంగానే ఉన్నారని, సికిల్ సెల్ సమస్యతో ఒకరు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులు అనారోగ్యంకు గురైతే తక్షణమే ఉపాధ్యాయులకు తెలియజేయాలని, అంతేగాని ఇంటికి వెళ్ళరాదని సూచించారు. కొత్తవలస రహదారి బాగా పాడైందని, దీనిపై కొత్త రోడ్డుకు అనుమతిని మంజూరు చేస్తున్నామని, టెండర్ల ప్రక్రియకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, ఈలోగా గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. కలెక్టర్ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ గిరిజన వసతి గృహ విద్యార్థులకు సౌకర్యాలు పెరుగుతున్నాయని, పిల్లల ఆరోగ్యానికి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందించడం జరుగుతుందన్నారు. జ్వరాల సీజనులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాలని, పిల్లలకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా ఉపాధ్యాయులే దగ్గరుండి వారిని సంరక్షించాలని తెలిపారు. మూఢనమ్మకాలతో, అవగాహన లేమితో నాటు వైద్యులను ఆశ్రయించరాదని, పిల్లలకు ఎటువంటి సమస్య వచ్చిదెఎన్ఎం ద్వారా ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సాలూరు ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్య నారాయణ, ఎంపిపి జి.రాములమ్మ, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు శుభ్రత పట్ల అవగాహన కల్పించడమే 'ముస్తాబు' : మంత్రి

జిల్లాలోని ప్రతి పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు శుభ్రత పట్ల అవగాహన కల్పించడమే ముస్తాబు కార్యక్రమ ఉద్దేశ్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో కూడా పిల్లలు చక్కగా తయారవుతూ, వాళ్ల ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి ఒక ఇది ఒక అద్భుతమైన కార్యక్రమమని చెప్పారు. పిల్లలు శుభ్రంగా తయారైన తర్వాత వాళ్లలో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెరిగి చక్కగా చదువు కోవాలని, చక్కగా భోజనం చేయాలని కోరిక పుడుతుందని తెలిపారు. చక్కగా చదువుకొని విజ్ఞానం పెరుగుతుందనే ఉద్దేశంతో ఈరోజు మన మన్యం జిల్లాలో ప్రత్యేకంగా ముస్తాబు అనే కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. ఈ జిల్లాలోనే ఈ కార్యక్రమం మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టామని, ఇంకా రాష్ట్రంలో అంటే... మనం ఒక వినూత్నంగా ఒక కార్యక్రమం చేయాలన్నారు. పిల్లలకి శుభ్రత అలవాటు చేయాలని ఈ కార్యక్రమం పెట్టుకున్నామని గుర్తుచేశారు.

ఆర్‌టిసి ఎమ్‌డితో ఎమ్మెల్యే భేటీ

పార్వతీపురంటౌన్ : ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శుక్రవారం అమరావతిలో కలిశారు. ఇటీవల పార్వతీపురం బస్టాండ్‌లో బాణాసంచా పేలుడులో గాయపడిన బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్యే బాధిత కుటుంబాలు నిరుపేదలని వారిని ఆదుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ ఎండీ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై రవాణాశాఖ మంత్రితో మాట్లాడామని, బాధితు లకు త్వరలోనే ఆర్థిక సాయమందుతుందని ఎమ్మెల్యే తెలిపారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్

విద్యార్థుల సమస్యలకు పరిష్కారమెప్పుడు?

ఎస్ఎఫ్ఐ జీపుయాత్రలో జిల్లా కార్యదర్శి అఖిల్

ప్రజాశక్తి - కొమరాడ

ఈ ఏడాది విద్యా సంవత్సరం మొదలై ఐదు నెలలు గడుస్తున్నాను ప్రభుత్వ విద్యా సంస్థల్లో నేటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని, హాస్టళ్లలో సమస్యలతో విద్యార్థులు అవస్థలుపడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగ సమస్యలపై పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ చేపట్టిన జీపు యాత్ర రెండో రోజు మండల కేంద్రంలో శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా కెజిబివి, గురుకుల పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ఉలిపిరి బాలికల ఆశ్రమ పాఠశాలతో పాటు మండలంలోని పలు విద్యా సంస్థలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బిడ్డక అనిల్, టి.అఖిల్ మాట్లాడుతూ మండలంలోని ఉలిపిరి ఆశ్రమ పాఠశాలకు రామభద్రపురం నుంచి రోడ్డు సౌకర్యం దారుణంగా ఉందని, తక్షణమే తారురోడ్డు నిర్మించాలని, జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 15 మంది విద్యార్థులు మరణించారన్నారు. ఈ మరణాలకు బాధ్యత ఎవరని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మొదటి సంతకం త్వరగా అమలు చేసి, ఎఎన్‌ఎంలను నియమించాలని, ప్రస్తుత రేట్లుకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించాలని, కురుపాం గురుకులంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేసియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ బృందం పాల్గొంది.

అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా : ఎస్‌పి



చెక్‌పోస్టు రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి సిబ్బందికి సూచించారు. మండలంలోని ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్విన్ పేట, గుణుపూర్ ప్రధాన రహదారి సమీపాన ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్‌ను శుక్రవారం ఆయన ఆకస్మిక సందర్శించారు. చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను, సిబ్బంది విధులను, చెక్ పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. గంజాయి, నాటుసారా రవాణా, అసాంఘిక కార్యక్రమాల నియంత్రణకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు ఏవిధంగా చేపడుతున్నది, ఎంతమంది సిబ్బంది విధుల్లో ఉంటున్నది అడిగి తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, తనిఖీలను క్షుణ్ణంగా చేపట్టాలని, పోలీస్ అధికారులు, సిబ్బంది అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలని సూచించారు. చెక్ పోస్ట్ చుట్టు పక్కల ఉన్న చిన్న, చిన్న రహదారుల మీద కూడా దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. సిసి కెమారాల పనితీరును పర్యవేక్షించారు.

ఎల్విన్ పేట పోలీసు స్టేషన్ తనిఖీ

అనంతరం ఎస్‌పి ఎల్విన్‌పేట పోలీసు స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ ప్రాంగణం, చుట్టుపక్కల పరిసరాలను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. రిసెప్షన్ కౌంటర్, స్టేషన్లో గల వివిధ రికార్డులను పరిశీలించి, నమోదైన కేసులపై ఆరా తీశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు ఏ విధంగా జరుగుతుందని ఆరా తీసి సదరు కేసుల ఛేదింపునకు దోహదపడే దర్యాప్తు విధానాలపై ఎస్పీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రికార్డులు పెండింగ్‌లో లేకుండా సక్రమంగా నిర్వహించాలని, రహదారిపై విధిగా వాహన తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి గంజాయి, నాటుసారా అక్రమ రవాణా నియంత్రకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేయాలని, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో గల శాంతి భద్రతల సమస్యల గురించి అడిగి తెలుసుకొని, సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే ఉన్నతాధికారుల దష్టిలో పెట్టాలన్నారు. కార్యక్రమంలో పాలకొండ డిఎస్పీ రాంబాబు, ఎల్విన్‌పేట సిఐ హరి , ఎస్సై శివ ప్రసాద్, సిసి సంతోష్ సిబ్బంది ఉన్నారు.

భామిని : జిల్లావార్షిక తనిఖీల్లో భాగంగా బత్తిలి పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి మాధవ్ రెడ్డి సందర్శించారు. పోలీస్ స్టేషన్లలోని ఎస్‌హెచ్ఒ, రైటర్, కంప్యూటర్, సిబ్బంది గదులను, కేస్ ప్రాపర్టీ భద్రపరిచిన గదులను, సీజ్ చేసిన వాహనాలను, స్టేషన్ పరిసరాలను, పోలీస్ స్టేషన్ మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం, పోలీసు స్టేషనులో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులు, వివిధ న్యాయ స్థానాల్లో ట్రయల్స్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సిడీ ఫైళ్లను ఎస్పీ పరిశీలించి, కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాలకొండ సిఐ ప్రసాదరావు , బత్తిలి ఎస్సై అప్పారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి హేండ్‌బాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - సాలూరు

స్కూల్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలో మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ శ్యామ్యూల్ తెలిపారు. ఇటీవల విజయనగరంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-17 హేండ్‌బాల్ బాలుర, బాలిక ఎంపికలో కళాశాల విద్యార్థిని చింతపల్లి శ్రావణి (ఇంటర్ మొదటి సంవత్సరం) రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అలాగే అండర్-19 విభాగంలో నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ సిహెచ్ రవి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.



రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

నీటి పన్ను బకాయి వసూలు చేయాలి : సబ్ కలెక్టర్


ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో పేరుకుపోయిన నీటి పన్ను బకాయిలను తక్షణమే వసూలు చేయాలని సబ్ కలెక్టర్ ఆర్ వైశాలి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్, విఆర్‌ఒలు, సర్వేలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి తీరువా పన్ను రూ.కోటీ 60లక్షలు ఉండగా, రూ. కోటీ 52లక్షలు వసూలైందని, మిగిలిన మొత్తాన్ని త్వరితగతిన వసూలు చేయాలని విఆర్‌ఒలను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో భూరీసర్వేలో రైతులకు ఇబ్బంది లేకుండా సక్రమంగా చేయాలని సర్వేయర్లకు సూచించారు. రేషన్ కార్డుల పంపిణీ సక్రమంగా చేయాలని రైస్ మిల్లు యాజమాన్యం వారికి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. మండలంలో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, సుమారుగా 42వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి శివ గణేష్‌కు సూచించారు. సమావేశంలో తహశీల్దార్ బాలమురళీకృష్ణ, విఆర్‌ఒలు, సర్వేయర్లు, రైస్‌మిల్లు యజమానులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని దళిత యువతి ఆవేదన

వీరఘట్టం; ప్రేమించానని నమ్మించి పెళ్లంటే కాదు పొమ్మంటున్నాడని మండలం రేగులపాడు పంచాయతీ బొడ్లపాడు చెందిన యువతి రుంజల దీప ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే గ్రామానికి చెందిన మజ్జి బాలకృష్ణ నాలుగేళ్లు సహజీవనం చేసి వివాహం చేసుకోకుండా ముఖం చాటేస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఆ యువతి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.నని, న్యాయం జరగకపోతే చావే శరణ్యమంటూ ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.

28న వైసిపి ఆధ్వర్యాన నిరసన ర్యాలీ



ప్రజా ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ ఈనెల 28న పార్వతీపురంలో ప్రజా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీని నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మావుడి శ్రీనివాసరావు, పట్టణ, మండల వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్వీశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర అనుబంధ విభాగాల ప్రధాన కార్యదర్శులు, పార్టీ ప్రతినిధులు బలగ నాగేశ్వరరావు, ఎక్కపోలు సింహాచలం, మజ్జి శేఖర్, రెడ్డి రవి, ఎన్.సదానందం, చింతల ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఈనెల 28న వైసిపి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం నిర్వహిస్తున్నామని, దీనికి ప్రజలంతా సహకరించాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర తెలిపారు. ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరిస్తుందని, ఈ విధానాన్ని వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసన చేపడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని అన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజలంతా వ్యతిరేకించాలని, ఇందుకు వైసిపి తోడుగా ఉంటుందని తెలిపారు. ఈనెల 28న తలపెట్టిన ఆ ఉద్యమానికి ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పల నాయుడు, గిరి రఘు, మద్దెల గోవింద, కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్ ను జియ్యమ్మ వలస మండలం చినమేరంగిలో మాజీ డిప్యూటీ సిఎం పి.పుష్పశ్రీవాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 28న కురుపాంలో వైసిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందిస్తామన్నారు.కావున ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




ప్రజా ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి : సిపిఎం

పజాశక్తి- కొమరాడ

జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో రాయగడ, పాలకొండ, వీరఘట్టం నుంచి దళారీలు వచ్చి వారికి ఇష్టం వచ్చిన ధరకు కొనుగోలు చేసే పరిస్థితి ఉందన్నారు. కాబట్టి ఇప్పటికైనా పత్తి దిగుబడి మరో నెల రోజుల్లో వస్తున్న నేపథ్యంలో వెంటనే జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు మద్దతు వెంటనే ప్రకటించి ఆదుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిఐటియు నాయకులు గౌరు నాయుడు, పత్తి రైతులు పాల్గొన్నారు.



రీసర్వేను పరిశీలిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

రీసర్వే ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఇప్పలవలసలో నిర్వహిస్తున్న భూరీసర్వేని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేస్తూ దిశా నిర్దేశం చేశారు. వీలైనంత వరకు పక్కా రికార్డులతో భూయజమానుల సమక్షంలోనే రీసర్వే చేపట్టాలని అన్నారు. సర్వే అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి రీసర్వేను చేపట్టాలని, ఎక్కడా ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా చేపట్టాలని ఆదేశించారు. అదే సమయంలో ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ కూడా పక్కాగా ఉండాలని, పూర్తి చేసిన మేరకు రికార్డులన్నీ పారదర్శకంగా ఉండాలని జేసీ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో రెవిన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిసనర్, అధికారులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గౌరీశ్వరి

ఆమోదం పొందినా అభివృద్ధి పనులు చేయరా?

మున్సిపల్ అధికారులను నిలదీసిన చైర్‌పర్సన్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో అజెండాలో ఆమోదం పొందిన అభివృద్ధి పనులు ఇంత వరకూ జరగకపోవడమేమిటని, ఆయా పనులు జరిపించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి ఎఫ్ఎసి మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజును ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆమె తన ఛాంబర్లో కమిషనర్, మేనేజర్, ఎఇ, ఆర్ఐ, జెఎఒలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ, పలు సమావేశాల్లో పట్టణానికి సంబంధించిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదించినప్పటికీ, ఆ పనులు ప్రారంభించకపోవడానికి కారణం ఏమిటి అని కమిషనర్‌ను ప్రశ్నించారు. అనంతరం ఈనెలలో జరిగే కౌన్సిల్ సమావేశంలో అజెండాలో ఆరో వార్డులో సిసి రోడ్డు, 8,12,22 వార్డుల్లో సిసి కాలువలు, పాత బస్టాండ్ రోడ్డు సిసి రోడ్డు, తోటపల్లి పంప్ హౌస్ వద్ద సిసి రోడ్లుకు కౌన్సిల్ ఆమోదానికి పెట్టాలని సూచించారు. వారం రోజుల్లో 3 రోజులు వార్డు పర్యటనలు చేపట్టడం జరుగుతుందని, మీతో పాటు కార్యాలయంలోని అధికారులు పాల్గొనేలా ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. నైట్ షెల్టర్ వేరే స్వచ్ఛంద సంస్థకు అప్పగించేందుకు ఏడాది క్రితం కౌన్సిల్ ఆమోదం పొందిందని, కొందరు కౌన్సిల్ సభ్యులు డీసెంట్‌ను చైర్ పర్సన్‌కు ఇవ్వకుండా కమిషనర్ ఇవ్వడంతో నైట్ షెల్టర్‌ను ఆ స్వచ్ఛంద సంస్థకు అప్పగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదని, వెంటనే ఆ నైట్‌షెల్టర్‌ను కౌన్సిల్ ఆమోదం పొందిన స్వచ్ఛంద సంస్థకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి వారం నిర్వహించే ప్రజా దర్బార్ సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తుందని కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ఐదు మండలాల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై పెద్ద ఎత్తున వినతులు ఇచ్చారు. అందించిన సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యను తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజా దర్బార్ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

నేడు గొరడలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలం లోని గొరడలో కలెక్టర్ ప్రభాకరరెడ్డి శనివారం పర్యటిస్తారని ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. రేగిడి పిహెచ్సి పరిధిలో ఉన్న మలేరియా కేసు నమోదైన నేపథ్యంలో గొరడలో మన ఊరికి మలేరియా వచ్చింది అను కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కావున అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

హక్కు పత్రాలతోనే భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - పాచిపెంట

హక్కు పత్రాలతోనే భూ సమస్యలు త్వరతగతిన పరిష్కరించబడతాయని డిఆర్డిఎ పిడి ఎం.సుధారాణి అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ, వెలుగు కార్యాలయాలను ఆమె సందర్శించారు. వారసత్వ హక్కు పత్రం రిజిస్టర్డ్ డాక్యుమెంట్ గిఫ్ట్ డాక్యుమెంట్ వంటి ఆధారాలు సమర్పిస్తే దరఖాస్తులు గడువులోగా పరిష్కారానికి సులభతరమవుతుందని ఆమె తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో కొన్నింటికి పూర్తిస్థాయిలో రికార్డు లేకపోవడంతో సమస్య పరిష్కారానికి జాప్యమవుతుందని అన్నారు. రెవెన్యూ సమస్యలు అర్థం చేసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని, పిజిఆర్ఎస్లో అందిన సమస్యలు కూడా వెను వెంటనే పరిష్కారం కావాలని తహశీల్దార్ డి.రవిని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ, వెలుగు సిబ్బంది రైతులతో కలిసి సమావేశం నిర్వహించి కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. అలాగే పత్తి కొనుగోలు చేసే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. మండలంలో వెలుగు ద్వారా డ్వాక్రా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.800కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఎపిఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎస్సై పి.నారాయణరావు కురుపాంలో శుక్రవారం ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాల్లేని వాహనదారులకు అపరాద రుసుం వేసి, రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం మద్యపానం సేవించకుండా, ధ్రువీకరణ పత్రాలు కలిగి ద్విచక్ర వాహనం నడిపాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపి నుంచి అవార్డును అందుకుంటున్న తిరుమలసాయి కరస్పాండెంట్ వెంకటరమణ

తిరుమల సాయి హైస్కూల్‌కు ఎడ్యు ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలలో శిక్షణ ఇచ్చి ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్ది, వివిధ రంగాల్లో స్థిరపడేలా విశేషమైన కృషి చేసినందుకు జియమ్మవలస మండలం పెదమేరంగి తిరుమల సాయి ఉన్నత పాఠశాలకు ఎడ్యుఐకాన్ అవార్డు వచ్చినట్లు కరస్పాండెంట్ రౌతు వెంకటరమణ తెలిపారు. విశాఖ ఎంపి మతుకుమిల్లి భరత్, మళ్ళా బ్యూరో ఆఫ్ చైల్డ్ డెవలప్మెంట్ అధ్యక్షులు మల్లా రామునాయుడు, మల్లా శ్రీవాణి , స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ చేతులు మీదుగా అవార్డ్ అందుకున్నారు. రెండేళ్ల కిందట ఇదే పాఠశాలకు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్‌ను హైదరాబాద్‌లో పొందారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షులు తులసీప్రసాద్, ముని ఇంటర్నేషనల్ స్కూల్స్, (ఢిల్లీ) నిషా అధ్యక్షులు కులభూషణ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, వివిధ రాష్ట్రాల ప్రైవేట్ పాఠశాలలు కరస్పాండెంట్లు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ఈ అవార్డు పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతివాడ శంకరరావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, అభినందనలు తెలిపారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని పట్టణంలోని కుమ్మరవీధికి చెందిన మహిళలు మున్సిపల్ ఎఫ్ఎసి కమిషనర్ జి.శ్రీనివాసరాజును కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. తమ వీధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వీటి వృద్ధులు, మహిళలు, పిల్లలు క్షణక్షణం భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లే క్రమంలో కుక్కలు వెంట పడడం వల్ల బిక్కు బిక్కుమంటూ భయపడుతున్నారని, రాత్రి వేళల్లో వాటి అరుపుల వల్ల ఏ ఒక్కరికీ నిద్ర పట్టడం లేదని, ఈ విషయంపై గతంలో మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి రక్షించాలని కోరారు.. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉందని, ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, వీటిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - కురుపాం

పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్సై నీలకంఠరావు విద్యార్థులకు "లైంగిక నేరాల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర" అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చోడిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

చోడి పంటలో అధిక దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు ఎస్.స్రవంతి, ఎం.అనంతవిహారి మండలంలోని దురిబిలి గిరిజన గ్రామంలో రైతులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చోడి పంట దీర్ఘ చతుస్రకారంలో మొక్కకు మొక్కకు దూరం పాటిస్తూ నాటలని, 30 రోజుల తర్వాత మొక్క చేనుపై నుంచి పైకి లాగడం వల్ల పిలకలు బలంగా వస్తాయని తెలిపారు. దీనిద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు.

ఫార్మర్ మాస్టర్ ట్రైయినీలకు శిక్షణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి జట్టు కార్యాలం వద్ద ఫార్మర్ మాస్టర్ ట్రైనర్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రబంధకులు ఎం.శ్రావణ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ ప్రతి మాస్టర్ ట్రైనర్ 10 మంది రైతులతో పంటల నమూనాలు వేయించాలని, ప్రతి నెలకు రూ.25వేలు ఆదాయం పాదించాలే ప్రణాళికాబద్ధంగా చేయాలన్నారు.రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ మాట్లాడుతూ అపరాలు సాగు చేయడం వల్ల ప్రతి రైతు ప్రధాన పంటతో పాటు మిగతా పంటలుగా వేసుకున్న ఆముదం, కంది, గోరు చిక్కుడు, సజ్జ, అలసందలు, బయోడైవర్సిటీ పంటలుగా ఆవాలు, ముల్లంగి తోటకూర గోంగూర, మొదలగు పంటలు వేసుకోవాలన్నారు. జట్టు సంస్థ వ్యవస్థాపకులు డా.డి. పారినాయుడు మాట్లాడుతూ జిల్లాలో 500 గ్రామాలు బయోగ్రామాలుగా మారాలని, దీనికి ఫార్మర్ మాస్టర్ ట్రైనర్లు, మిగతా సిబ్బంది సహాయ సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎలు, యంగ్ ప్రొఫెషనల్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ప్రజాశక్తి -వీరఘట్టం

ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు రైస్ మిల్లర్ల యాజమానులను కోరారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కుదరదు, కొనడం జరగదని అలా రైతులతో మాట్లాడొద్దని, రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. బ్యాంక్ గ్యారంటీ కూడా సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైస్ మిల్లుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు గోనె సంచులు, లేబర్, ప్రింటర్స్, డేటా ఆపరేటర్‌ను కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని, రైతు నుంచి అదనంగా ధాన్యం తీసుకోవద్దని హెచ్చరించారు. మండలంలోని 17 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యం పెట్టుకున్నామని, ఈ లక్ష్యాలు చేరుకునేందుకు మీ సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఎఒ జె.సౌజన్య, సిఎస్‌డిటి జి.ప్రసాదరావు, రైస్ మిల్లు యాజమాన్యం పాల్గొన్నారు.

పార్వతీపురం: వచ్చేనెలలో ప్రారంభం కానున్న ధాన్యం సేకరణపై మండలస్థాయి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సురేష్ కోరారు. తన కార్యాలయంలో రైస్ మిల్లుల యజమానులు, విఎఎలు, విఆర్‌ఒలు, పిఎసిఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, సిఎస్ డిటి పాల్గొన్నారు.

బీజీలు త్వరితగతిగా కట్టాలి

సీతానగరం : రైస్ మిల్లు యాజమానులు బీజీలు వేగంగా కట్టాలని తహశీల్దార్ జె.ప్రశాంత్ కుమార్, ఎస్.అవినాష్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రైస్‌మిల్ యాజమానలు, విఆర్‌ఒలు, విఎఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసేందుకు నవంబర్ మొదటి వారంలోనే ధాన్యం కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. వీటిపై మిల్లు యజమానులు రైతు సేవా కేంద్రాలకు ముందుగా మంచి గోనెలను అందజేయాలన్నారు. బ్యాంకు గ్యారంటీలు వేగంగా కట్టాలన్నారు. మండలంలో 18 కొనుగోలు కేంద్రాలను 10 సొసైటీల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సిఎస్‌డిటి రమేష్, హెచ్‌డిటి వి.ఉమామహేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్‌ఒలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వీరఘట్టం : సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ కామేశ్వరరావు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంఇఒలు డి.గౌరు నాయుడు, ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని 17 పాఠశాలల నుంచి 40 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ప్రథమ స్థానం కంబరవలస జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.దినేష్, ద్వితీయ స్థానం గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు కె.గౌరీ శంకర్‌కు తృతీయ స్థానం నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన వి.కుమారస్వామి లభించాయి. వక్తృత్వ పోటీల్లో ఎస్.నీరజా గాయత్రి (నీలా నగరం), జి.శరణ్య (నరసాపురం), ఎం.అక్షయ (రేగులపాడు) విజేతలు గా నిలిచారు. క్విజ్ పోటీలో ప్రథమ స్థానం ఎస్.నీరజ గాయత్రి (నీలా నగరం), ద్వితీయ స్థానం వి.కుమారస్వామి (నీలా నగరం), తృతీయ స్థానం జి.శరణ్య (నరసాపురం) లభించాయి. వీరికి ఎంఇఒలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈనెల 29 లేదా 30 తేదీల్లో పాలకొండలో జరగనున్న నియోజకవర్గస్థాయి పోటీలు పాల్గొంటారన్నారు.

నేత్ర శస్త్రచికిత్స చేసుకున్న వారికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇటీవల నేత్ర చికిత్స చేయించుకున్న 15 మందికి ఫాలోఅప్ చికిత్సలో భాగంగా శుక్రవారం నేత్ర వైద్యాధికారి జి.నగేష్ రెడ్డి దృష్టి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి దృష్టి లోపం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కళ్లను ఎలా జాగ్రత్తగా ఉంచుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించి కంటి చూపునకు ఉపయోగపడే ఆహార పదార్థాలు గూర్చి తెలిపారు. అన్నిటికన్నా మనిషికి నేత్రాలు చాలా విలువైనవని, కావున వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర సురేష్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎఫ్ఎస్ఎన్ఎంలో వేప నూనె

ప్రజాశక్తి - పాచిపెంట

జాతీయ ఆహార భద్రత, పోషక యాజమాన్యం (ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం) పథకంలో భాగంగా 850 లీటర్ల వేప నూనె వచ్చిందని, పూర్తి ధర లీటరు రూ.640 కాగా, రైతు రూ.320 చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. రబీ సీజన్లో మొక్కజొన్న 5వేల ఎకరాలకు పైగా సాగవుతుందని, ఈ పంటలకు ఆశించే కత్తెర పురుగు గుడ్డు దశ నుండే నివారణకు వేప నూనె ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. తొలి దశలో ఒక లీటర్ నీటికి ఐదు మిల్లీలీటర్ల వేపనూనె కలిపి పిచికారీ చేసుకున్నట్లయితే కాండంతో పురుగు, కత్తెర పురుగు, రసం పీల్చుపురుగులు నివారించబడతాయని తెలిపారు. కావున రైతులు ఏదైనా పురుగుమందుతో కలిపి పిచికారీ చేసుకుని ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిఒక్కరూ డ్రైడే పాటించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వ్యాధుల నియంత్రణకు పరిశుభ్రత ముఖ్యమని, కావున డ్రైడే అందరూ పాటించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని నర్సిపురంలో ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ జగన్‌మోహనరావుతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఫ్రైడే డ్రైడే జరుగుతున్న తీరుపై గ్రామంలో పరిశీలించారు. లార్వా ఉనికి కోసం నీటి నిల్వలు,ఇంటి పరిసరాల్లో నీటి తొట్టెలు పరిశీలించారు. ఎప్పటికపుడు ఫీవర్ సర్వే జరపాలని, సకాలంలో జ్వర నిర్ధారణ జరగాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానికులకు వ్యాధులు, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపులు, డ్రమ్ములపై మూతలు పూర్తిగా ఉంచాలన్నారు. అనంతరం జెడ్‌పి ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై తెలుసుకున్నారు. ఆరోగ్య అవగాహన కర పత్రాలను అందజేసి వ్యాధులు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను ప్రతీ వారం క్రమం తప్పకుండా విద్యార్థులకు వేయించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, హెచ్ఎం సత్యనారాయణ, సూపర్వైజర్ జయగౌడ్, సైన్స్ టీచర్ బాలకృష్ణారావు, వైద్య సిబ్బంది రాజేశ్వరి, దేవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట, అంటిపేటలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ ఎం.వెంకటరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ద్వారా గ్రామాల్లో మురుగునీరు తొలగింపు, బకెట్లు, డబ్బాల్లో ఉండే నీళ్లు తొలగించి అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు వి.సన్యాసి నాయుడు, బి.తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శులు ఎ.సంతోష్, ఎ.శశికుమార్, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక గ్రామపంచాయతీలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములు చేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో ఎటువంటి పరిస్థితుల్లో తడి వాతావరణం ఉండకూడదని ఐటిడిఎ ఇన్‌ఛార్జి ఎపిఒ గణేష్ తెలిపారు. మలేరియా ఇతరత్రా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కనుక ప్రతి ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంటింటికి వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మిశ్రా, డిప్యూటీ ఎంపిడిఒ బి.రామకృష్ణ, ఎంఇఒ ఆనందరావు, ఆశ్రమం పాఠశాల హెచ్ఎం చంద్రరావు, ఉపాధ్యాయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం : పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వెంకటరావు

వీరఘట్టం : మండలంలోని శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని అన్ని వీధుల్లో పర్యటించి కాలువల వద్ద బ్లీచింగ్ చల్లడం జరిగింది. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, సచివాలయాల ప్రత్యేక అధికారులు, సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎం లు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో గొటివాడ పంచాయతీ నేరేడువలసలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ముమ్మరంగా పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొమరాడ ఎపిటిడబ్ల్యు ఆర్ స్కూల్ లో చదువుతున్న నేరేడు వలసకు చెందిన పువ్వల వినయ్ జ్వరం వచ్చిందన్నారు. దీంతో ఆ విద్యార్థిని ఇంటికి పంపించిన నేపథ్యంలో వెంటనే కురుపాం సిహెచ్‌సికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించగా మలేరియా పాజిటివ్ వచ్చిందన్నారు. వెంటనే పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా అక్కడ వైద్యం అందిస్తుండగా ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ఇంటింటికి వెళ్లి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి, తాగునీటి ట్యాంకులను పరిశుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

ఐటిడిఎ వద్ద ఆదివాసీ ఆరోగ్య హెల్త్ వాలంటీర్లు ధర్నా

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గతంలో గిరిజన విద్యార్థులకు వైద్య సేవలు అందించిన "ఆదివాసీ ఆరోగ్యం హెల్త్ వాలంటీర్లతో కలిసి శుక్రవారం స్థానిక ఐటిడిఎ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ హెల్త్ వాలంటీర్లు ఉన్న సమయంలో వారు చేసిన వైద్య సేవలు వల్ల గిరిజన విద్యార్థుల మరణాల సంఖ్య తక్కువగా ఉండేదని, వారిని తొలగించడంతో వరుసగా గిరిజన విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మొదటి సంతకం ఎఎన్ఎంలను నియామకానికి పెట్టానని ప్రకటన చేశారని, ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య హెల్త్ వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు ఇస్తున్నట్లు డైట్ ఛార్జీలు పెంచి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో, గురుకులాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపిఒ వెంకట గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు టి.గణేష్, అల్లు చందు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు ఎన్.రోజారమణి, హెల్త్ వాలంటీర్లు ఎ.గౌరీశ్వరీ, ఎన్.జ్యోతి, ఎస్.చంద్రకళ, ఎమ్.సుజాత, కె.రమణమ్మ, బి.నక్షత్ర, వి.జానకి, ఎస్.మీనా కుమారి, వి.సంతోష్ కుమారి, ఎస్.సావిత్రి, బి.కృష్ణవేణి, కె.ప్రమీళ, ఎన్.ప్రియాంక, ఎస్.గౌరి, కె.నాగమణి, అమల, ఎ.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీజన్ ఎమ్‌డికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



ఎంపి నుంచి అవార్డును అందుకుంటున్న శ్రీజన్ కరస్పాండెంట్ శ్రీను

విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న పట్టణంలోని బెలగాంలో గల శ్రీజన్ గ్లోబల్ పాఠశాలల కరస్పాండెంట్ ఉప్పిలి శ్రీనుకు ఈ ఏడాది "స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్, నిషా, అపుస్మా, ట్రస్మాతో కలిసి మల్లబ్యూరో ఆఫ్ చైల్డ్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ వారు దేశవ్యాప్తంగా అందించే ఎడ్యుఐకాన్ 2025 అవార్డును విశాఖ ఎంపి ఎం. శ్రీభరత్, నిసా అధ్యక్షులు కులభూషణ్ శర్మ, అపుస్మా చీఫ్ మెంటార్ కష్ణారెడ్డి, అపుస్మా అధ్యక్షులు తులసి విష్ణు ప్రసాద్, ట్రస్మా అధ్యక్షులు మధు, మల్లు బ్యూరో ఆఫ్ చైల్డ్ డెవలప్మెంట్ అధ్యక్షులు మల్లు రామునాయుడు, మల్లు శ్రీవాణి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎండి శ్రీను విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అందించే ఎడ్యుఐకాన్ 2025 అవార్డు తనకు లభించడం ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ అవార్డుతో తమ బాధ్యత మరింత పెరిగిందని, విద్యార్థులను మరింత ఉన్నత విద్య ప్రమాణాలు తీర్చిదిచ్చేందుకు మరింత కృషి చేస్తానని అన్నారు. శ్రీనుకు ఈ అవార్డు రావడం పట్ల, పాఠశాల అధ్యాపక బృందం, ఆయన మిత్ర బృందం అభినందనలు తెలిపారు.

ప్రయివేటుకు ప్రభుత్వ వైద్య కాలేజీలు ధారాదత్తం


ప్రజాశకిత - బలిజిపేట

పేదల వైద్యం ప్రైవేటు సంస్థలకు ధారాధత్వం చేసేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆరోపించారు. వైసిపి హయాంలో చేపట్టిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు సంస్థలకు ధారాధత్తం చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మండలంలోని సుభద్ర, శివరామపురంలో శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెచ్చిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల ఫీజులు భరించలేని అంతగా పెరుగుతాయని, ఉచిత వైద్యం పేదలకు అందుబాటులో ఉండదని అన్నారు. ఈ నేపథ్యంలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరించొద్దంటూ రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ పూర్తి చేసి రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తామని తెలిపారు, కార్యక్రమంలో జెడ్‌పిటిసి అలజంగి రవికుమార్, ఎంపిపి గుడివాడ నాగమణి, సర్పంచులు రంభ శ్రీనివాసరావు, మండల వైసిపి అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

మొండెంఖల్‌లో కోటి సంతకాలు సేకరణ



కురుపాం : మొండెంఖల్‌లో సంతకాల సేకరణలో పాల్గొన్న వైసిపి నాయకులు

కురుపాం : కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటుపరం చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని మొండెంఖల్ పంచాయతీలో మండల వైసిపి కన్వీనర్ ఐ.గౌరీశంకర్రావు ఆధ్వర్యంలో శుక్రవారం కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో మెడికల్ కాలేజీలు మంజూరు చేసి పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను అందించాలని లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం నీరుగారుస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచులు హెచ్. నాగేశ్వరరావు బి, రాజయ్య, మాజీ ఎంపిపి ఆనిమి ఇందిరా కుమారి, ఎంపిటిసి జి.విద్యారాణి, ఐ.రామకృష్ణ, రేపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని దుడ్డుఖల్లు, దాదూపురంలో స్థానిక ఎంపిటిసి నిమ్మక లక్ష్మణరావు, జన్ని వెంకటరావు ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలు ప్రవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి నాయకులు కోటి సంతకాలు సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నిమ్మక గోపాల్, నాయకులు పి.కృష్ణ, పి.చిరంజీవి, పి.సుమన్, కె.ప్రదీప్, కె.రామారావు నిమ్మక గౌరీశంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -కొమరాడ

మద్యానికి బాస్పైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన ఎస్సై కె.నీలకంఠం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం కోటవానివలసకు చెందిన కొచ్చర్ల సుధీర్ కుమార్ (30) మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు వచ్చాయి. గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించినప్పటికీ సుధీర్‌కుమార్‌లో మార్పు రాకపోవడంతో విసిగి చెందిన భార్య కన్నవారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన సుధీర్ తన భార్యను ఇంటికి రమ్మని పిలిచినప్పటికీ ఆమె రాలేదు. దీంతో గడ్డి మందు తెచ్చుకుని కొమరాడ మండలం విక్రాంపురం దగ్గర గల ఒక మామిడితోటలో తాగినట్లు తెలిపారు. ఆ విషయం భార్యకు తెలియజేయగా పార్వతీపురం ఆసుపత్రితో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య భార్గవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో మాక్ అసెంబ్లీ

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఆదర్శ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాక్ అసెంబ్లీలో గవర్నర్, స్పీకర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, ప్రధాన ప్రతిపక్ష నాయకులు పాత్రల్లో మాక్ అసెంబ్లీని చక్కగా నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగంలో ప్రభుత్వ పాలన, అసెంబ్లీ నిర్వహణపై ప్రతి విద్యార్థికి అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో ఈ మాక్ అసెంబ్లీని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ బాబురావు తెలిపారు. ఇలాంటి మాక్ అసెంబ్లీ వల్ల భవిష్యత్తులో యువత గొప్ప రాజకీయ నాయకుడిగా తయారై సమాజసేవకుడిగా మారడానికి తోడ్పడతాయని, అలాగే రాజ్యాంగం పట్ల కూడా అవగాహన కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక ఉపాధ్యాయులు సంతోష్ శ్రావణి, వినోద్ పాల్గొన్నారు.

అర్తలిలో ఇంటింటికి కుళాయి కనెక్షన్

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలో అర్తలిలో శుక్రవారం మండల పరిషత్ 15 ఫైనాన్స్ నిధులతో బోర్వెల్ విత్ మోటర్, ఇంటింటి కొళాయి కనెక్షన్లు వేశారు. స్థానిక ఎంపిటిసి సభ్యులు, ఎంపిపి బొమ్మాలి భాను సుధాకర్ ఆధ్వర్యంలో తాగునీరందించారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాలి భాను సుధాకర్ మోటార్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించగా, అర్తలి పంచాయతీ సర్పంచ్ గుణుపూరు శివ, మాజీ సర్పంచ్ కోడి శ్రీహర్ రావు, కూటమి నాయకులు పొగిరి వెంకటరమణ, మాజీ సర్పంచ్ బొమ్మాలి ఆదినారాయణ, సీనియర్ కార్యకర్తలు మజ్జి శ్రీనివాసరావు, బొమ్మలి సురేష్, బొమ్మాలి హరిబాబు, డోల గోపి, బొత్స కృష్ణ, రాగోలు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని గుమ్మలక్ష్మీపురం ఎటిడబ్ల్యుఒ రజిని సంబంధించిన సిబ్బందికి సూచించారు. స్థానిక బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టల్, పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలోని విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు, ఆహార పదార్థాలు, పరిసరాలను పరిశీలించారు. పి.ఆమిటి ఆశ్రమ పాఠశాలలో జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థినిలతో మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు వస్తే ఉపాధ్యాయులకు తెలపాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు.



పి.ఆమిటి వసతిగృహంలో జ్వరంతో బాధపడుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న ఎటిడబ్ల్యుఒ రజని